క్లుప్తంగా...

చందానగర్‌లో గురు సన్మానోత్సవం



గురుస్వామి మురళినంబూద్రిని సన్మానిస్తున్న దృశ్యం

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్‌లో అయ్యప్ప గురుస్వామికి గురు సన్మానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సోమాజిగూడ అయ్యప్పస్వామి ఆలయ అర్చక స్వామి మురళినంబూద్రిని అయ్యప్పస్వాములు ఘనంగా సత్కరించారు. ఎన్నో ఏళ్ళుగా అకుంఠిత దీక్షతో సేవలను చేస్తున్న ఆయనను గుర్తించి ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సన్నిధానంలోని మాలిక పురత్తు అమ్మవారి సన్నిధానం మేల్ శాంతి(ప్రధాన అర్చకులు) నియమించిన నేపథ్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వామి ప్రసాద రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దీప్తిశ్రీనగర్‌లోని పీజేఆర్ఎన్‌క్లేవ్ రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్పభక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ హ్యాండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

లంగర్‌హౌజ్: లంగర్‌హౌజ్‌లో ఏర్పాటైన ఇన్‌ఫాంట్ హ్యాండ్లూమ్ హ్యాండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. సంఘం వద్ద ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే కౌసర్ ఆదివారం ప్రారంభించారు. పిల్లలు, పెద్దలను ఆకట్టుకోవడమే కాకుండా ఆశ్చర్యపరిచే ఎన్నో త్రీడి జంతువుల బొమ్మలు ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. త్రీడి యానిమేటెడ్ గొరిల్లాలతో పాటు ఎన్నో రకాల క్రూర జంతువుల వద్ద పిల్లలు, పెద్దలు సంబ్రమంగా వీక్షిస్తున్నారు. రకరకాల హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులు అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశామని ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాప్సాన్ తెలిపారు.

తనూశ్రీకి ఉత్తమ ప్రతిభా అవార్డు-2023

చార్మినార్: కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచిన తనూశ్రీకి భారత్ ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభా అవార్డు-2023 లభించింది. పాతబస్తీ ఛత్రినాకకు చెందిన తనూశ్రీ చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటోందని.. రవీంద్ర భారతిలో జరిగిన కూచిపూడి నృత్యంలో చిన్నారి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు లభించిందని చిన్నారి గ్రాండ్ ఫాదర్ అయిన కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోనీ శ్యాం రావు ముదిరాజ్ తెలిపారు.

ఘనంగా 22వ శరణ్ మేళా

జియాగూడ: బసవ కల్యాణ్ పర్వ్ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బసవ కల్యాణ్‌లో పూజ్యశ్రీ మహాజగద్గురువు గంగా మాత నేతృత్వంలో 22వ కల్యాణ్‌పర్వ శరణ్ మేళా కార్యక్రమం ఏర్పాటు అయ్యింది. ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రి భగవంతు హాజరై అన్నదానం భవనం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ గౌరవ అధ్యక్షుడు సురేష్‌కోరే, రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప పాటిల్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ కుర్తిమామ, ప్రధాన కార్యదర్శి అనిల్‌పాటిల్, లింగాయత్ మహాసభ అధ్యక్షుడు విజయకుమార్ పట్నే, తెలంగాణ రాష్ట్రీయ బసవదళ్ ఉపాధ్యక్షులు జగన్నాథప్ప టైలర్, ప్రధాన కార్యదర్శి కె.మరుతి, ఉపాధ్యక్షుడు భగవంత్ జవాలే, జియాగూడ ఉపాధ్యక్షులు బసప్ప సాకోలే, కె.శివాజీ, సహకార్యదర్శి రాజేందర్ మేత్రి పాల్గొన్నారు.

సలావుద్దీన్ లోధీకి సత్కారం

చార్మినార్: బోనాల పండగ సందర్భంగా అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం తరపున ఎలాగైతే ఆర్థిక సహకారం లభిస్తుందో.. అలాగే వాల్మీకి ఆలయాలకు కూడా నిధులు ఇచ్చేటట్లు తాను ప్రయత్నిస్తానని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. వాల్మీకి జయంతి వేడుకలు సుల్తాన్‌షాహీలోని వాల్మీకి మహర్షి ఆలయంలో ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహ్మద్ సలావుద్దీన్ లోధీకి ఉత్సవాల నిర్వాహకులు మెమొంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయేది కూడా తమ ప్రభుత్వమేనని.. నిధుల మంజూరీకి తాను కృషి చేస్తానన్నారు. పత్తర్‌గట్టి బీఆర్ఎస్ అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ అహ్మద్, నిర్వాహకులు మనోజ్ బిడ్లా, రాజేష్, శ్యాంలాల్, దేవేందర్, ధర్మేందర్ బిడ్లా పాల్గొన్నారు.



నిర్మించారు.. వదిలేశారు..

- రూ.3.90 కోట్లతో మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్
- రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మాణం
- ఈ రెండూ వినియోగంలోకి వచ్చేది ఎన్నడో ?



నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ భవనం



స్పోర్ట్ కాంప్లెక్స్

రాయదుర్గం: ఆశయం గొప్పది, కానీ ఆచరణ మాత్రం ఉత్తదేనన్న చందంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించినా ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తోంది. ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు అతి చేరువలోనే ఉన్న రెండు ప్రధాన నిర్మాణాలు ఎంతో ఉన్నత లక్ష్యంతో నిర్మాణం చేసినా ఆశించిన ఫలితం లేకుండా పోవడం విడ్డూరం. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో నిర్మించిన జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం, టీఎన్‌జీఓకాలనీలో నిర్మించిన మోడల్ మార్కెట్ నిరుపయోగంగా మారాయి. వీటిని అందుబాటులోకి తేకపోవడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తు న్నారు.

- 2012 జూలై 21న రూ. 6 కోట్లతో ఖాజాగూడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే నిధుల విడుదలలో జాప్యంతో ఆరున్నరేళ్ళ క్రితం ఇండోర్‌స్టేడియం మాత్రమే నిర్మాణం చేశారు. ఈ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో నాలుగు బ్యాడ్మింటన్‌కోర్టులు, క్యారమ్స్, చెస్, మినీ జిమ్, కోచ్‌లు, యోగా గది,పరిపాలనాధికారి కార్యాలయం, రెస్ట్ రూమ్, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించారు. ఇప్పటి వరకు రూ.3.90 కోట్ల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణం రెండేళ్ళ క్రితమే పూర్తి చేశారు. అప్పటి నుంచీ ఇప్పటి వరకు తాళం వేసి ఉంచారు. కానీ వ్యాక్సినేషన్ కోసం వినియోగించారు.

రూ.50 లక్షల ఖర్చుతో మోడల్ మార్కెట్.. అయినా ప్రయోజనం శూన్యం

- మోడల్ మార్కెట్ల నిర్మాణానికి ఆరేళ్ళ క్రితం గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓ కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించారు. ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి స్థాయిలో చేయని స్థలంలో ఏర్పాటు చేయడం తో వ్యాపారాలు నిర్మించిన దుకాణాలు తీసుకొనేందుకు వ్యాపారులు వెనుకడుగు వేయడంతో దీన్ని నిర్మించినా మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టుల ఏర్పాటు



వాహనాల తనిఖీల్లో పాల్గొన్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు వాహనాల తనిఖీలు చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, మొయినాబాద్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద 24 గంటల వరకు సిబ్బంది వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన అనంతరం రూ.4.50 కోట్లను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన డబ్బును ట్రెజరీ, ఐటీ శాఖకు అప్పగించామన్నారు. రూ.10 లక్షల కన్న ఎక్కువగా ఉన్న డబ్బును ఐటీ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లను నిర్వహించామన్నారు. ప్రస్తుతం స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నాయన్నారు. ప్రతి స్టేషన్‌కు కేంద్ర బలగాలను అటాచ్ చేశామని.. వారి సమన్వయంతో బందోబస్తులో పాల్గొంటున్నారన్నారు. తమ ప్రాంతంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా ఇతర ఏ సమాచారమున్నా.. స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువగా ఉన్న డబ్బును తీసుకెళ్లే సమయంలో అందుకు సంబంధించిన పూర్తి దస్తావేజులను వెంట ఉంచుకోవాలన్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే కాగితాలను చూపించాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బైండోవర్లను సైతం చేస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

‘మన్‌కీ బాత్’ వీక్షించిన బీజేపీ నాయకులు



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం అత్తాపూర్ డివిజలో సాబాధ విజయ్ కుమార్ నివాసంలో బీజేపీ నాయకులు తిలకించారు. చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా యువత కోసం మేరా యువత భారత్ వేదికను ప్రారంభించనున్నట్లు మోదీ ప్రసంగంలో పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించేందుకు ఇది అవకాశాలను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సాబాధ స్వప్న, మొంద్ర నర్సింహా, బర్ల మల్లారెడ్డి, సనీవెల్లి కృష్ణ, పుస్తకాల అశోక్, జయానంద్ రెడ్డి, కిరణ్ చారి, నవీన్, కాకుళారం కృష్ణ, సాయి యాదవ్, మ్యాడం రాము, కొండమీది లింగం, సోమనాథ్ రెడ్డి, శివ కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కళాకృతి నృత్యాలయ గురువు భారతి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఇందులో పుష్పాంజలి, ఆనందనర్తన గణపతిం, మామవతు, కట్టెదుర వైకుంఠం, దుర్గే దుర్గే, చిన్నిశిశువు, దేవర్ణమా, డోలాయం తదితర అంశాలను కళాకారులు విష్ణుప్రియ, తనిష్క, అధిత్రి, శ్రీనయన, సహస్ర, సంజనలు పాల్గొని ప్రదర్శించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ డిపార్ట్‌మెంట్ 8వ బెటాలియన్ పోలీస్ బ్యాండ్‌ను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

గృహహింస చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని తదితరులు

హఫీజ్‌పేట్ : మహిళలకు గృహహింస చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అంతే కాకుండా మహిళలు స్వశక్తితో ఎదగాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని వసంత సిటి క్లబ్ హౌజ్‌లో కోవె తెలంగాణ ఛాంబర్స్ ఆధ్వర్యంలో కోవె హట్ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు దేశ వ్యాప్తంగా 50 శాతం సొంతగా వ్యాపార రంగాలలో రాణిస్తున్నారని 10 శాతం మహిళలు మాత్రం గృహిణిలుగా ఉంటు వారి పిల్లలను చూసుకుంటున్నారన్నారు. నేటి సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమానంగా పోటీ పడుతున్నారన్నారు. పురుషులతో పోల్చితే మహిళలకు అనేక చట్టాలను రాజ్యాంగం తీసుకువచ్చిందన్నారు. అనంతరం క్లబ్ హౌజ్‌లో మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన వాటిని ఆమె సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ అధ్యక్షురాలు చేతన్ జైన్, వైస్ ప్రెసిడెంట్ కల్పనరావు, సెక్రటరీ నీరజ గొడవర్తి, ట్రెజరర్ నిషా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పీస్ మార్చ్

గచ్చిబౌలి: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల బృందం పీస్ మార్చ్‌ను నిర్వహించింది. నానక్‌రాంగూడలోని ప్రధాన రోడ్లపై పోలీసులు ఈ కవాతును నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల భద్రత ఉంటుందని అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలి పోలీసుల ఆధ్వర్యంలో ఈ కవాత్తును నిర్వహించారు.అదనపు డీసీపీ పర్యవేక్షణలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, అయిదు మంది ఏఆర్ సైబరాబాద్‌లు, సీఐఎస్ఎఫ్ ఫోర్స్ ఈ కవాత్తులో పనాల్గొన్నారు.

రెజ్లర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

రాయదుర్గం: రాజేంద్రనగర్ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ను రంగారెడ్డిజిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కలిశారు. రాయదుర్గానికి చెందిన అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్యామ్లెట్ పాండు ఆధ్వర్యంలో రాయదుర్గం, మణికొండ, జిల్లాలలోని వివిధ ప్రాంతాలకు చెందిన రెజ్లింగ్ సభ్యులు, రెజ్లర్లు కలిసి ఆయనను సన్మానించారు. అనంతరం రెజ్లర్ల సమస్యలను వివరించి పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

గోల్కొండ: గాజాపై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని అఖిల భారత సిరత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. ఆదివారం రిసాల బజార్‌లోని మజీద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాజాలోని మహిళలు, చిన్న పిల్లలను టార్గెట్ చేసుకొని ఇజ్రాయిల్ సేనలు దాడులు చేస్తుందని ఆయన అన్నారు. కేవలం పాలస్తీనా ప్రజల కక్షతోనే ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేయడమే కాక తమ సైన్యాన్ని కూడా గాజాలో పంపి అల్లకల్లోళం సృష్టిస్తుందని ఆయన అన్నారు. ప్రపంచ దేశాలు పాలస్తీన ప్రజల హక్కుల పరిరక్షణకు అండగా ఉంటూ ఇజ్రాయిల్ తమ దాడులను వెంటనే ఆపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం కూడా యుద్ధం ఆపేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అందరి సహకారంతోనే విజయం

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ఈసారి బీజేపీ విజయ దుందుబి మోగించడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం, బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్ తొత్తుగా మారిందన్నారు. కేవలం మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకోవడానికే సీఎం కేసీఆర్ మజ్లిస్ పార్టీ ఆగడాలను భరిస్తున్నారని అన్నారు. మరో వైపు కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు పార్టీలు మార్చే ఊసరవెల్లి అని ఆయన అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

సంగీత కళలు మన జాతి సంపద

గన్‌ఫౌండ్రీ: సంగీత కళలు మన జాతి సంపద అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో భారత ఆర్ట్స్ అకాడమి, ఏబీసీ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ వెంకట చిన్నసత్యం 94వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిరి మువ్వలు పేరిట నిర్వహించిన సాంప్రదాయ కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు నృత్యగురువులను ఘనంగా సన్మానించారు. డిసెంబర్ 24న 8 వేల మంది కళాకారులతో నిర్వహిస్తున్న కూచిపూడి కళావైభవం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినీనటి మలక్‌పేట శైలజ, స్వామిరామానంద తీర్థ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ సాయిలక్ష్మి, వెంకట చినసత్యం కూతురు కామేశ్వరి, కూచికూడిపూడి నృత్యగురువు శేషుబాబు, భారత ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు లలిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పని చేయాలి



బైరాగిగూడలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: ప్రతి నాయకుడు, కార్యకర్తా సైనికుడిలా పని చేసి బీఆర్ఎస్ పార్టీ విజయం కోసం పాటుపడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ, బైరాగిగూడ తదితర ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ తలారీ చంద్రశేఖర్‌లతో కలిసి దళిత, బీసీ, రైతు, మైనార్టీ బంధు తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ చేసిన అభివృద్ధి ఎంతో ఉందన్నారు. ప్రజలంతా మరోసారి బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ విజయం కోసం ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు గోకరి సురేష్‌గౌడ్, కార్పొరేటరు పద్మావతిపాండు, పద్మావతి పాపయ్యయాదవ్, ఖాజాభాయ్, నాగరాజు, సాగర్‌గౌడ్, గ్రామ శాఖ బీఆర్ఎస్ అధ్యక్షులు ధనుంజయ్, శ్యామ్‌లేట్ రాజు, కృష్ణసాగర్ తదితరులున్నారు.

ఆరెమైసమ్మ ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభం..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ లక్ష మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ ఆరెమైసమ్మ ఆలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆరెమైసమ్మ ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్లు చంద్రశేఖర్, సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



మైలార్‌దేవ్‌పల్లిలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్

మైలార్‌దేవ్‌పల్లి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పేదల ఆకలి, సంక్షేమం, అభివృద్ధి చూసిందే కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఆయన మైలార్‌దేవ్‌పల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో పేదలకు దక్కింది ఏమి లేదన్నారు. రాష్ట్ర ప్రజల కష్టాలను తీర్చాలని, రాష్ట్రాన్ని దేశంలోనే పేరెన్నికగన్న రాష్ట్రంగా తీర్చిదిద్ది ప్రజల తెలంగాణ చేయాలనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం ఇచ్చిందన్నారు. అప్పటికే ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ నాయకులు దోచుకునేందుకు అప్పుల పాలు చేసి ప్రజలను నట్టేట ముంచారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను బయటకు తీయటంతో పాటు బంగారు తెలంగాణ అంటే ఏమిటో చేసి చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్. ధనుంజయ్, బి బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, నాయకులు బాలరాజు, మజ్జిగ నరసింహారెడ్డి, సాయిరెడ్డి, బి.వెంకటేష్, సుధాకర్, ఓంప్రకాష్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, సతీష్, లక్ష్మణ్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటును వినియోగించుకోండి



మాట్లాడుతున్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

అత్తాపూర్: ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు ఎవరికి వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రలోభాలకు గురి కాకుండా నిర్ణయించుకున్న అభ్యర్థికి ఓటు వేసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టిఫెన్ రవీంద్ర అన్నారు. అత్తాపూర్ సిక్ చావునీలోని గురు నానక్ హైస్కూల్‌లో ఆదివారం సిక్కుల సోదరులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఎప్పటికప్పుడు సమావేశమై స్థానిక రౌడీషీటర్లకు హెచ్చరించడం జరిగిందన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో ఇప్పటికే కేంద్ర బలగాలు, పోలీసులతో కవాత్తు నిర్వహించామన్నారు. స్థానిక గురు నానక్ పాఠశాలలో అన్ని మతాలకు చెందిన ఓటర్లు ఉన్నారని.. 16 బూత్‌లలో పెద్ద ఎత్తున ఓటు వేసేందుకు వస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా చూస్తామని సిక్కు మత పెద్దలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాజేంద్రనగర్ అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్‌జీవోస్ కాలనీలోని ఇతర పార్టీకి చెందిన 100 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత మూడు పర్యాయాలు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా ఉంటూ ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిస్కరిస్తుండడంతోనే ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నరేందర్‌కు పెరుగుతున్న మద్దతు



నరేందర్‌కు మద్దతు తెలిపిన గండిపేట నాయకులు

మణికొండ: కాంగ్రెస్ పార్టీలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టికెట్‌ను సాధించి సత్తా చాటిన మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌కు పార్టీతో పాటు ఆయన అభిమానులు, బంధు, మిత్రుల నుంచి మద్దతు పెరుగుతుంది. శుక్రవారం రాత్రి టికెట్‌ను ప్రకటించినప్పటి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వేలాది మంది వచ్చి ఆయనకు మద్దతు తెలపటంతో పాటు రాబోయే ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పనిచేసి గెలిపించుకుంటామని హామీ ఇస్తున్నారు. రెండు రోజులుగా ఆయన పుప్పాలగూడలోని కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో ఉండగా అక్కడికే గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాలకు చెందిన పార్టీ క్యాడర్ వచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వెంట వచ్చి మరికొందరు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకుని పార్టీలో చేరి ఆయనకు మద్దతు ఇస్తున్నారు. సమయం చిక్కినపుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్యనాయకులు, పలు గ్రామాలు, కాలనీల పెద్దలను కలిసి ఆయన మద్దతు కోరుతున్నారు.

వికలాంగులకు అండగా మజ్లిస్ పార్టీ



గోల్కొండ: వికలాంగులకు మజ్లిస్ పార్టీనే కాకుండా తను కూడా ఎప్పుడూ అండగా ఉంటున్నానన్నారు. ఆదివారం ఆయన కార్వాన్ మోగల్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ వికలాంగుడు ఆయనను కలిసి తన సమస్యలను ఆయనకు వివరించారు. ఎంతో మంది వికలాంగులకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ సరిపోవడం లేదని ఆ వికలాంగుడు తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్‌లో కేవలం వికలాంగులకే ఎక్కువ పింఛన్ అందిస్తుందన్నారు. ప్రతి యేటా మజ్లిస్ పార్టీ తరఫున కూడా పేద విద్యార్థులకు, వికలాంగులకు వివిధ రకాలుగా సహాయం చేస్తున్నామని అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, బద్రుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230